ప్రభాత గమనం

PRABHATA GAMANAM

తెలుగు దినపత్రిక

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

హైదరాబాద్ | సంపుటి : 04 | సంచిక : 315 | గురువారం | 10-9-2026 | ధర-5 | పేజీలు-4

గవర్నర్‌ను కలిసిన కేటీఆర్

- కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ
- గవర్నర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ...
- 1000 రోజులు గడిచినా కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని విమర్శ...
- తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు...
- దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు అందజేత...
- రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వ వైఫల్యంపై ఆరోపణ....



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేల బృందం బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, అందుకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు సమర్పించారు.అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు.వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర.....?

- కేసీఆర్‌పై అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు
- స్పీకర్‌ను దూషించడంపై రేవంత్ ఆగ్రహం
- ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధమని వెల్లడి
- బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారని విమర్శ
- స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదని వ్యాఖ్య



హైదరాబాద్ సెప్టెంబర్ 9(ప్రభాత గమనం):

అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెంట్, ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. శాసనసభలో బుధవారం మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఇలాంటి ఘటన తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్‌తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని ప్రజాస్వామ్యవాదులు భావించారని అన్నారు. కానీ కేసీఆర్ అలా చేయలేదని విమర్శించారు.ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమస్యలు చర్చకు వస్తే తమ గుట్టు రట్టవుతుందనే భయంతోనే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపి సభకు పంపించారని మండిపడ్డారు.ఎక్కడైతే ఈ కుట్రకు తెరలేచిందని ఆరోపించారో.. అదే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి దప్పులు వాయించేందుకు ప్రయత్నిస్తే అక్కడ శుద్ధీకరణ చేశారని రేవంత్ అన్నారు. ఉత్తరాఖండ్‌లో ఖర్గే నిరసనలో పాల్గొన్న మైదానాన్ని శ్రీరామసేన శుద్ధీకరణ చేసిందని గుర్తుచేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటన తెలంగాణలోనూ చోటుచేసుకుందని వ్యాఖ్యానించారు.స్పీకర్ స్థానాన్ని అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని సీఎం పేర్కొన్నారు. సభలో సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజాసమస్యలపై చర్చకు సహకరించాలని కోరారు.

విడ్డూరం.. యువకుడి కడుపులో గర్భాశయం!

- ఢిల్లీలో 26 ఏళ్ల యువకుడిలో మహిళల అవయవాలు
- సంతానలేమి సమస్యతో ఆసుపత్రికి వెళ్లిన యువకుడు
- స్కానింగ్‌లో గర్భాశయం, ఫెలోపియన్ ట్యూబ్స్ ఉన్నట్టు గుర్తింపు
- ఇది ప్రపంచంలోనే అరుదైన వైద్య పరిస్థితి అని వెల్లడి
- శస్త్రచికిత్స చేసి గర్భాశయాన్ని తొలగించిన వైద్యులు



న్యూఢిల్లీ సెప్టెంబర్ 9(ప్రభాత గమనం):

ఢిల్లీలో ఒక అత్యంత అరుదైన వైద్య వింత వెలుగులోకి వచ్చింది. సంతానలేమి సమస్యతో బాధపడుతూ చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన 26 ఏళ్ల యువకుడి శరీరంలో గర్భాశయం, ఫెలోపియన్ ట్యూబ్స్ ఉండటాన్ని గుర్తించిన వైద్యులు విస్మయానికి గురయ్యారు. సాధారణ పరీక్షల క్రమంలోనే ఈ వింత విషయం బయటపడింది.ఢిల్లీకి చెందిన సదరు యువకుడు సంతాన సంబంధిత సమస్యలతో వైద్యులను సంప్రదించగా, అతనికి స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ తరుణంలో పొత్తికడుపులో మహిళలకు ఉండే గర్భాశయం, ఫెలోపియన్ ట్యూబ్స్ ఉన్నట్లు తేలింది. వైద్య పరిభాషలో ఈ అరుదైన పరిస్థితిని 'పర్సిస్టెంట్ ముల్లెరియన్ డక్ట్ సిండ్రోమ్' అని పిలుస్తారని వైద్యులు వెల్లడించారు. జన్యుపరంగా పురుషుడైనప్పటికీ, వారి శరీరంలో స్త్రీ పునరుత్పత్తి అవయవాలు కూడా అభివృద్ధి చెందడం ఈ సిండ్రోమ్ యొక్క ప్రధాన లక్షణం.ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు ఇలాంటి కేసులు 300 కంటే తక్కువగానే నమోదయ్యాయని వైద్య నిపుణులు వివరించారు. ఇది అత్యంత అరుదైన స్థితి కావడంతో దీనిని గుర్తించడం కూడా కష్టతరమని వారు పేర్కొన్నారు. అనంతరం వైద్యులు ఆ యువకుడికి శస్త్రచికిత్స నిర్వహించి, గర్భాశయ సంబంధిత భాగాలను విజయవంతంగా తొలగించారు. ప్రస్తుతం ఆ యువకుడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం.


విజయ్ కూటమికి కొత్త పేరు..

- 'సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్'

- తమిళనాడు సీఎం విజయ్ కూటమికి కొత్త పేరు ఖరారు
- కూటమి చైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్న సీఎం విజయ్
- సమన్వయ సమావేశానికి దూరంగా వామపక్ష పార్టీలు

హైదరాబాద్ సెప్టెంబర్ 9(ప్రభాత గమనం):

తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ నేతృత్వంలోని అధికారిక కూటమికి నూతన పేరు ఖరారైంది. ఈ కూటమికి "సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్" (ఎస్ఎస్‌జేవీఏ)గా నామకరణం చేశారు. చెన్నై పనైయూర్‌లోని టీవీకే ప్రధాన కార్యాలయంలో ముఖ్యమంత్రి విజయ్ అధ్యక్షతన జరిగిన భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నూతన కూటమికి విజయ్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల అనంతరం ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జరిగిన రెండో అతిపెద్ద సమావేశం ఇది. ఈ భేటీలో టీవీకే, కాంగ్రెస్, విడుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే), మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కళగం (ఎండీఎంకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) పార్టీల అగ్రనేతలు పాల్గొన్నారు. అయితే, ప్రభుత్వానికి వెలుపల నుంచి మద్దతు తెలుపుతున్న సీపీఐ, సీపీఎం పార్టీల ప్రతినిధులు మాత్రం ఈ సమావేశానికి హాజరుకాలేదు.రాబోయే రోజుల్లో తమిళనాడు, పుదుచ్చేరిలో జరగనున్న ఉపఎన్నికల్లో సమష్టిగా పోటీ చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. మధురాంతకం, ధరాపురం వంటి నియోజకవర్గాలకు అభ్యర్థుల పేర్లను



త్వరలోనే ప్రకటించే అవకాశముంది. కూటమి విధివిధానాలు, ఉమ్మడి కనీస కార్యక్రమం, స్టీరింగ్ కమిటీ ఏర్పాటు వంటి కీలక అంశాలపై కూడా విస్తృతంగా చర్చించినట్లు తెలుస్తోంది.లౌకికవాదం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూనే, విజయ్ పేరు స్ఫురించేలా "విక్టరీ" అనే పదాన్ని కూటమి పేరులో చేర్చడం గమనార్హం. ఈ కూటమి ద్వారా రాష్ట్ర రాజకీయాల్లో డీఎంకే, అన్నాడీఎంకేలకు దీటైన ప్రత్యామ్నాయంగా, మూడో ప్రధాన శక్తిగా ఎదగాలని విజయ్ వర్గం లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన..

- కేంద్రానికి మద్దతు
- ఈ20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదన్న మంత్రి పొన్నం ప్రభాకర్..
- తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అసెంబ్లీలో వెల్లడి...
- ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వాదనకు తెలంగాణ మద్దతు...

హైదరాబాద్ సెప్టెంబర్ 9(ప్రభాత గమనం):

ఇథనాల్ కలిపిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన శాసనసభలో వెల్లడించారు.ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల నుంచి గానీ రవాణా శాఖ దృష్టికి ఎటువంటి సమాచారం రాలేదని మంత్రి తెలిపారు. "ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి మా వద్ద ఎటువంటి ప్రతికూల నివేదికలు లేవు. అందువల్ల, దీనిపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసే లేదా నియంత్రణ చర్యలు చేపట్టే ఆస్కారం లేదు" అని ఆయన వివరించారు.ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఏకీభవించారు. గత జూలైలో కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సైతం లోక్‌సభలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ కలిపిన ఇంధనంతోనే నడుస్తున్నాయని, ఇంజన్ వైఫల్యాలపై ఎటువంటి నిర్దిష్ట ఫిర్యాదులు రాలేదని ఆయన వెల్లడించారు.గతంలో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్), ఈ20 ఇంధనంలోని అధిక తేమ, క్లోరైడ్ స్థాయిల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. అయితే, ఈ అంశంపై మరింత ధ్రువీకరణ అవసరమని పేర్కొంటూ తదనంతరం ఆ లేఖను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఈ20 ఇంధనం వల్ల వాహనాలకు ఎలాంటి ముప్పు లేదనే అభిప్రాయంతో ఉన్నాయి.



ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
PRABHAT A GAMANAM

జనరల్ న్యూస్

గురువారం
10-9-2026

ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం...



కేసముద్రం సెప్టెంబర్ 9 (ప్రభాత గమనం):

కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ లో బుధవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తెలంగాణ భాష, సంస్కృతి, సాహిత్య పరిరక్షణకు కాళోజీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ప్రజల భావాలను, ఆకాంక్షలను తన రచనల ద్వారా ప్రపంచానికి చాటిన మహనీయుడిగా కాళోజీ నిలిచారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన రచనలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయని, విద్యార్థులు కాళోజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని మాతృభాషను ప్రేమించి గౌరవించాలని సూచించారు. తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు వీరబోయిన సుమన్ మాట్లాడుతూ..తెలంగాణ భాష విశిష్టత, మాధుర్యం, సాంస్కృతిక వైభవం గురించి విద్యార్థులకు వివరించారు. మాతృభాష పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కాళోజీ సాహిత్య ప్రస్థానం, ప్రజాకవిగా ఆయన చేసిన సేవలను వివరించారు. తెలంగాణ భాష ప్రజల జీవన విధానాన్ని ప్రతిబింబించే గొప్ప భాష అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు రైతు రిజిస్ట్రేషన్ తప్పని సరి...

– మండల వ్యవసాయ అధికారి వెంకన్న...

కేసముద్రం సెప్టెంబర్ 9 (ప్రభాత గమనం):



రైతులందరూ తప్పనిసరిగా రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారీ వెంకన్న తెలిపారు. బుధవారం కేసముద్రం మండల రైతు వేదిక లో రైతులకు రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందించే వివిధ ప్రభుత్వ పథకాలు, రాయితీలు, వ్యవసాయ సేవలు,ఇతర ప్రయోజనాలు పొందేందుకు రైతు నమోదు చేసుకోవడం తప్పనిసరి అని సూచించారు.కావున గ్రామంలోని రైతులందరూ తమ ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, పట్టాదారు పాస్‌బుక్, భూమి వివరాలు,అవసరమైన ఇతర పత్రాలతో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి, వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సంప్రదించి రైతు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరడమైనది.రైతు నమోదు చేసుకోని రైతులు ప్రభుత్వ వ్యవసాయ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున,రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే నమోదు చేసుకోవాలనీ సూచించారు.ఈకార్యక్రమంలో ఏఈఓలు రాజీవ్ లోచన్, లావణ్య, శ్రీకాంత్,సాయి చరణ్, శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి...

– ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు పర్వత కోటేష్

కేసముద్రం సెప్టెంబర్ 9(ప్రభాత గమనం):

హమాలి కూలీ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సమగ్ర చట్టం చేయాలని, హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి లేబర్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు పర్వత కోటేష్ డిమాండ్ చేశారు.ఈ నెల 15న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న హమాలీ కార్మికుల రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం హమాలీ యూనియన్ కేసముద్రం ఏరియా కమిటీ అధ్యక్షులు బండి రాజు అధ్యక్షతన జరిగింది.అనంతరం హమాలీ సంఘం కేసముద్రం ఏరియా కమిటీ గౌరవాధ్యక్షులు మిట్టగడపల వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో పర్వత కోటేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. హమాలి కార్మికులు నిత్యం శ్రమిస్తూ సమాజానికి అవసరమైన సరుకుల రవాణా, లోడింగ్, అన్‌లోడింగ్ వంటి పనులు చేస్తున్నప్పటికీ వారికి సరైన కార్మిక హక్కులు, సామాజిక భద్రత, సంక్షేమ సౌకర్యాలు అందడం లేదన్నారు. హమాలి కార్మికుల సమస్యల శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర హమాలి చట్టం చేయాలని, ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రతి హమాలి కార్మికుడికి గుర్తింపు, లేబర్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హమాలి కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్ తదితర కార్మిక సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ కేసముద్రం ఏరియా కమిటీ సహాయ కార్యదర్శి మేకల రాజు, ఆంగోత్ నరేష్,యాకయ్య, శ్రీనివాస్ రెడ్డి, పి. శ్రీనివాస్, సంజీవ,దూడయ్య, ఆదినారాయణ,డి. రాజు, ఉప్పలయ్య, ఎన్. కుమార్, ఊదరి వీరయ్య,ముత్యాల ఉపేందర్,గుండెల సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ డ్రామా పోటీలకు శ్రీవివేకవర్ధిని విద్యార్థుల ఎంపిక

కేసముద్రం సెప్టెంబర్ 9(ప్రభాత గమనం):

జిల్లా కేంద్రంలోని అనంతారం మోడల్ స్కూల్ ఆవరణలో బుధవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో కేసముద్రం పట్టణంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించారు. సముద్రాల సంరక్షణ– పునరుద్ధీకరణ అనే అంశంపై విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ డ్రామా న్యాయనిర్ణేతలను ఆకట్టుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు ఎంతో దోహదప డతాయని అన్నారు. సముద్రాల సంరక్షణ నేటి ప్రపంచానికి అత్యంత అవసరమైన అంశమని, విద్యార్థులు సందేశాత్మకంగా ప్రదర్శించిన డ్రామా జిల్లా స్థాయిలో గుర్తింపు పొందడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. డ్రామాలో పాల్గొన్న విద్యార్థులు, గైడ్ టీచర్ మేకల విష్ణును కరస్పాండెంట్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



ఘనంగా తక్కెళ్ళపల్లి రవీందర్ రావు జన్మదిన వేడుకలు



కేసముద్రం సెప్టెంబర్ 9(ప్రభాత గమనం):

బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు జన్మదిన వేడుకలను కేసముద్రం పురపాలక సంఘం పరిధిలో బిఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు వల్లందాస్ యశ్వంత్ వారి కుటుంబ సభ్యులు బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేసముద్రంలోని చైతన్య నగర్ ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, ఇతర రాత సామగ్రితో కూడిన కిట్లను, పండ్లను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లను అందజేసి, తక్కెళ్ళపల్లి రవీందర్ రావు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ సేవా కార్యక్రమంలో బిఆర్ఎస్ యూత్ సభ్యులు వల్లందాస్ శ్రీకాంత్, శ్రీనాథ్, పందుల సతీష్, మామిడి అజయ్, స్టాలిన్, వినీత్, బాబురావు, పట్ల చందు, బన్నీ, సన్నీలతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలి...

– ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు...
– జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్...



మహబూబాబాద్ సెప్టెంబర్ 9(ప్రభాత గమనం):

తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలను బుధవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ హాజరై, కాళోజీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాకవి కాళోజీ తెలంగాణ ఆత్మను, ప్రజల జీవనాన్ని, సామాజిక స్పృహను తన కవిత్వంలో ప్రతిబింబించిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. తెలుగు మాత్రమే కాకుండా ఉర్దూ, హిందీ, మరాఠీ, ఆంగ్లం, తదితర భాషల్లో కూడా కవితలు రచించిన బహుభాషా కోవిదుడిగా కాళోజీ నిలిచారని తెలిపారు.సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటం చేసిన ప్రజా కవిగా కాళోజీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై స్పందిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కాళోజీ చేసిన కృషి అందరికీ ఆదర్శమని అన్నారు.కాళోజీ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1992లో పద్మ విభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసిందని గుర్తు చేశారు. ఒకసారి ఎమ్మెల్యేగా సేవలందించిన కాళోజీ ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు.జీవితాంతం మానవతా విలువలను ఆచరించిన కాళోజీ, మరణానంతరం కూడా తన అవయవాలను దానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కాళోజీ ఆశయాలు, మానవతా దృక్పథం, సామాజిక న్యాయం కోసం చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు.అదే విధంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, అధికారులు, కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు సమర్పించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఐడీఓసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జేసీ అనిల్‌ను కలిసిన క్యాంప్ తండా సర్పంచ్ కైక..

- పాస్ పుస్తకాలను పంపిణీ చేసిన జాయింట్ కలెక్టర్..
- జేసీకి కృతజ్ఞతలు తెలిపిన మాజీ ఎంపీటీసీ రవి



కేసముద్రం, సెప్టెంబర్ 9(ప్రభాత గమనం):

ఉమ్మడి నారాయణ పురం గ్రామానికి చెందిన రైతుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది.నారాయణపురం గ్రామానికి చెందిన భూములకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలను జాయింట్ కలెక్టర్ అనిల్ కుమార్ ను కలిసిన సర్పంచ్ కైక మరియు మాజీ ఎంపీటీసీ రవి నాయక్ లు పట్టాదారు పాస్ పుస్తకాలను జేసీ చేతుల మీదుగా స్వీకరించారు.సోమవారం రోజున కలెక్టరేట్‌లో జేసీ అనిల్ కుమార్ ను క్యాంప్ తండా సర్పంచ్ కైక, మాజీ ఎంపీటీసీ రవి నాయక్ తో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాల ప్రక్రియ పూర్తి కావడంతో, వాటిని అధికారుల చేతుల మీదుగా ప్రజాప్రతినిధులు అందుకున్నారు.గిరిజన తండా రైతుల భూ సమస్యలను పరిష్కరించి, వేగవంతంగా పాస్ పుస్తకాలు అందజేసినందుకు గానూ జాయింట్ కలెక్టర్ అనిల్‌కు మాజీ ఎంపీటీసీ రవి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. రైతుల సంక్షేమానికి అధికారులు చూపిస్తున్న చొరవ అభినందనీయమని వారు పేర్కొన్నారు. పాస్ పుస్తకాలు చేతికి అందడంతో తండా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో తండాకు చెందిన పలువురు నాయకులు, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.



కేసముద్రం సెప్టెంబర్ 6(ప్రభాత గమనం):

మండల పరిధిలోని ఇంటికన్నె గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, వార్డు సభ్యుడు బోళ్ల రమేష్ నానమ్మ బోళ్ల లచ్చమ్మ అనారోగ్యంతో మృతిచెందడం తీవ్ర విచారకరమని కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.పార్టీ నాయకులు బోళ్ల వెంకన్న, మల్లయ్యల తల్లి లచ్చమ్మ మరణించిన విషయం తెలుసుకున్న సమ్మయ్య గౌడ్, ఆదివారం ఇంటికన్నెలోని వారి నివాసానికి చేరుకున్నారు. లచ్చమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి అశ్రునయనాల మధ్య నివాళులర్పించారు. అనంతరం ఆమె కుమారులు వెంకన్న, మల్లయ్యలతో పాటు మనుమళ్లు బోళ్ల రమేష్, హరీష్, కార్తీక్‌లను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టకాలంలో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.?ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ... పార్టీ కోసం పనిచేసే ప్రతీ నాయకుడికి, కార్యకర్తకు కాంగ్రెస్ అండగా నిలుస్తుందన్నారు. కష్టసమయాల్లో భుజం తట్టి పక్కన నిలబడటమే పార్టీ ప్రాథమిక బాధ్యతని తెలిపారు. గ్రామాల్లో ఎవరికి ఏ కష్టం వచ్చినా సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో స్పందించి బాధితులకు ఆసరాగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఇంటికన్నె కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజులపాటి మల్లయ్య, నల్లమాస ఉప్పలయ్య, రాజులపాటి వెంకన్న, వర్ధెల్లి రంజిత్, చలగోల వెంకన్న, కోతి రాజు, మిట్టగడుపుల యాకయ్య, గంగసిరి రమేష్, గడ్డం శ్రీనాథ్, వర్ధెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుండు సోమన్న ప్రథమ వర్ధంతి...

- నివాళులర్పించిన బి.విజయ సారథి...

కేసముద్రం సెప్టెంబర్ 10(ప్రభాత గమనం):

సిపిఐ సీనియర్ నాయకుడు, ప్రజాపోరాటాల యోధుడు గుండు సోమన్న ప్రథమ వర్ధంతి కార్యక్రమం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని విలేజ్ కేసముద్రంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకుడు బి. విజయ సారథి ముఖ్య అతిథిగా పాల్గొని, సోమన్న చిత్రపటానికి పూలమాల వేసి అశ్రునయనాల మధ్య నివాళులర్పించారు.ఈ సందర్భంగా విజయ సారథి మాట్లాడుతూ... సిపిఐ పార్టీ బలోపేతంలో గుండు సోమన్న కీలక పాత్ర పోషించారని కొనియాడారు. నాలుగు దశాబ్దాల పాటు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. నాటి భూస్వాములు, పెత్తందార్ల అణచివేతకు తలొగ్గకుండా పాలేరులు, పేదలు, రైతుకూలీల పక్షాన నిలబడి వీరోచిత పోరాటాలు చేశారని గుర్తుచేశారు.భూపోరాటాలు, కార్మికులు మరియు కర్షకుల హక్కుల సాధన కోసం నిరంతరం శ్రమించిన గుండు సోమన్న ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కన్వీనర్ చొప్పరి శేఖర్, నాయకులు మడత నారాయణ, వీరస్వామి, ఉపేందర్, కరుణాకర్, కోటయ్య, దాసరి సాయిలు, ఐలయ్య, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలపై బిజెపి మండిపాటు...

- 'ఛలో ఇందిరాపార్క్'ను విజయవంతం చేయాలని రమేష్ పిలుపు...



కేసముద్రం సెప్టెంబర్ 9(ప్రభాత గమనం):

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని, విద్యార్థి లోకాన్ని అడుగడుగునా దగా చేస్తోందని కేసముద్రం బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.ఈ సందర్భంగా ఆదివారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేసి మాట్లాడారు..విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టే 'మహా ధర్నా' (ఛలో ఇందిరాపార్క్) కార్యక్రమాన్ని విద్యార్థులు, యువకులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.రాష్ట్రంలో సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంతో 40 లక్షల మంది ఉన్నత చదువుల భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు.ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద జీవో 97 ద్వారా పాలిటెక్నిక్ విద్యార్థుల భవితను కాలరాస్తున్నారని మండిపడ్డారు.విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని రమేష్ అన్నారు. ఈ మహా ధర్నాకు కేసముద్రం మండలం నుండి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు భారీ సంఖ్యలో తరలిరావాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

గార్లలో వైభవంగా ముత్యాలమ్మ తల్లి బోనాల ఉత్సవం

- శ్రావణ మాసం సందర్భంగా ఇంద్రనగర్ కాలనీలో భక్తిశ్రద్ధలు
- అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించిన బైండ్ల కులస్తులు



గార్ల ,సెప్టెంబర్ 10(ప్రభాత గమనం):

శ్రావణ మాస మహోత్సవాలను పురస్కరించుకుని గార్ల మండల కేంద్రంలోని ఇంద్రనగర్ కాలనీలో బోనాల పండుగ భక్తిపారవశ్యం నడుమ వైభవంగా జరిగింది. ఏటా ఆనవాయితీగా నిర్వహించే ఈ ఉత్సవాలను ఈ ఏడాది కూడా బైండ్ల కులస్తులు సాంప్రదాయబద్ధంగా, అట్టహాసంగా నిర్వహించారు.ఉదయం నుంచే కాలనీలో పండుగ వాతావరణం అలుముకుంది. కాలనీకి చెందిన మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, భక్తిశ్రద్ధలతో సిద్ధం చేసిన బోనాలను శిరస్సున ధరించారు. మంగళవాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు, అమ్మవారి ఆధ్యాత్మిక గీతాల నడుమ పురవీధుల గుండా ఊరేగింపుగా ముత్యాలమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు నైవేద్యంగా బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా నిర్వహకులు మాట్లాడుతూ... అమ్మవారి దివ్య ఆశీస్సులతో మండల ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు పచ్చగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ పూజలు చేసినట్లు తెలిపారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో గార్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతి హతిరామ్ నాయక్, మాజీ సర్పంచ్ గంగావత్ లక్ష్మణ్ నాయక్ ప్రత్యేకంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వారితో పాటు బైండ్ల కుల సంఘ నాయకులు, మహిళలు, యువకులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తుల శివసత్తుల పూనకాలు, గోవింద నామస్మరణలతో ఇంద్రనగర్ కాలనీ అంతా ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది.

కాంగ్రెస్ దగాకోరు ప్రభుత్వం...



- మహిళా సమస్యలు గాలికి వదిలేసిన దుస్థితి..
- కాంగ్రెస్ తీరుపై బీఆర్ఎస్ నిప్పులు...
- ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి... బానోత్ శంకర్ నాయక్...
- వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఒరిగిందేమిటి? సత్యవతి రాథోడ్, కవిత
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'వంటా-వార్పు' నిరసన...

కేసముద్రం సెప్టెంబర్ 10(ప్రభాత గమనం):
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైందని ఆరోపిస్తూ కేసముద్రం మండల కేంద్రంలోని జ్యోతి రావు పూలె సెంటర్ లో బీఆర్ఎస్ మండల నాయకులు, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున "వంటా-వార్పు" నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ కవిత హాజరై ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.తాము రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 100 రోజులు ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇవ్వడం జరిగిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులైనా ఇప్పటికీ ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. మహాలక్ష్మి పథకం కింద రాష్ట్రంలో ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ. 2500 రూపాయల చొప్పున ఇస్తామని చెప్పి ఇప్పటికీ రాష్ట్రంలో ఏ ఒక్క మహిళ ఖాతాలో కూడా 2500 జమ చేసిన దాఖలాలు లేవని తెలిపారు. కేసముద్రంలోని ప్రతి మహిళకు 33 నెలలకు గాను రూ. 82,500 రుపాయలు ఈ ప్రభుత్వం బాకీ పడిందన్నారు. తాము అధికారంలోకి వస్తే వృద్ధులకు నేలకు 4000 పింఛన్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పటికీ ఏ అవ్వ తాత కు నెలకు 4000 రూపాయల చొప్పున పింఛన్ ఇవ్వడం లేదన్నారు. గత 33 నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు 66 వేల రూపాయల బాకీ పడిందని తెలిపారు. కల్యాణ లక్ష్మి పథకం కింద కేసీఆర్ ఇస్తున్న లక్ష 116 రూపాయలతో పాటు తాము అధికారంలోకి వస్తే తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు హామీ ఇచ్చారు.కానీ రాష్ట్రంలో కానీ మహబూబాబాద్ నియోజకవర్గంలో కానీ ఇప్పటివరకు ఏ ఒక్క మహిళకు రాష్ట్ర ప్రభుత్వం తులం బంగారం ఇవ్వలేదని దుయ్యబట్టారు. అలాగే కెసిఆర్ కిట్టు సైతం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇది దగాకోరు ప్రభుత్వమని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే మహిళలను లక్షాధికారులను చేస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు హామీ ఇస్తే మహిళలు నమ్మి ఓటేసి గెలిపించారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 1000 రోజులైనా రాష్ట్రంలో మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీలు ఈ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసినట్టుగానే ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మహిళలను కూడా మోసం చేసిందని మహిళా సంక్షేమానికి మొండి చేయి చూపుతుందని విమర్శించారు. మహిళలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని నేడు రాష్ట్రంలోని మహిళలంతా బాధపడుతున్నారని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ నారాయణ రావు,మాజీ జెడ్పిటీసి శ్రీనాథ్ రెడ్డి, రంగారావు,ఓలం చంద్రమోహన్,నజీర్, కమటం శ్రీను, రవీందర్ రెడ్డి, రమేష్, కౌన్సిలర్ లు వినయ్, శారదా, అరుణ, రాజమణి,ఆగె రాము,శరత్ యాదవ్, వీరు నాయక్,రవిచంద్ర రెడ్డి, ఊకంటి యాకూబ్ రెడ్డి,బిర్రు వెంకన్న, కొమ్ము రాహుల్, ఏర్పుల కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.



పెనుగొండలో బీజేపీ గ్రామ కమిటీ ఎన్నిక...

గ్రామ అధ్యక్షుడిగా ముత్యం ఉమేష్ గౌడ్ ఎన్నిక...



కేసముద్రం సెప్టెంబర్ 4(ప్రభాత గమనం):
పెనుగొండ గ్రామంలో భారతీయ జనతా పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సెప్టెంబర్ 2న జరిగిన ఈ సమావేశానికి మాజీ మార్కెట్ చైర్మన్ మాధవ పెద్ది శశివర్ధన్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పెనుగొండ గ్రామ బీజేపీ కమిటీని ఎన్నుకున్నారు. పెనుగొండ గ్రామ బీజేపీ అధ్యక్షుడిగా ముత్యం ఉమేష్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే శక్తి కేంద్రం ఇన్‌చార్జిగా జమ్ముల గోపాల్ రెడ్డి ఎన్నికయ్యారు. ఇక బూత్ కమిటీ అధ్యక్షులుగా పైండ్ల రాజు, సభ్యులుగా పోనక సోమరాజు, పెసర సురేష్, ఆడెపు వెంకన్నలను ఎన్నుకున్నారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నాయకులు సూచించారు.

ధర్మం, ప్రేమ, జ్ఞానానికి ప్రతీక శ్రీకృష్ణుడు

- యాదవ సంఘం కేసముద్రం మండల అధ్యక్షులు అల్లం వెంకటేశ్వర్లు యాదవ్..
- కన్నుల పండువగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు..
- ప్రజలను అలరించిన జారుడు స్థంభం..

కేసముద్రం, సెప్టెంబర్ 4(ప్రభాత గమనం):ధర్మం, ప్రేమ, జ్ఞానానికి ప్రతీక శ్రీకృష్ణుడు అని యాదవ సంఘం కేసముద్రం మండల అధ్యక్షులు అల్లం వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు. శుక్రవారం కేసముద్రం స్టేషన్ లో యాదవ సంఘం మండల అధ్యక్షులు అల్లం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు, యాదవ కులస్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ఉట్లు కొట్టు కార్యక్రమం తో పాటు ప్రధాన కూడలిలో జారుడు స్తంభం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం కేసముద్రం మండల అధ్యక్షులు అల్లం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడు అధర్మాన్ని ఎదుర్కొని ప్రజలను రక్షించాడని తెలిపారు. మనిషి తన కర్తవ్యాన్ని నిజాయితీగా చేయాలని, కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలని శ్రీకృష్ణుడు ప్రజలకు బోధించాడని తెలిపారు. శ్రీకృష్ణుడు కేవలం ఆరాధ్య దైవం మాత్రమే కాదని ఆయన గొప్ప గురువు, స్నేహితుడు, మానవ జీవితానికి మార్గదర్శి అని అల్లం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దన్నసరి సింగిల్ విండో వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్ రావు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు, సారగొల్ల సంగె రాజ్ కుమార్,మండల యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి నాగనబోయిన వెంకటేశ్వర్లు,అల్లం శ్రీకాంత్, నర్సింగం వెంకటేశ్వర్లు,తోడేటి వెంకటేశ్వర్లు,అల్లం నిరంజన్,కోడి సాయి, తోడేటి నరేష్,ఏలుగు కార్తీక్ యాదవ్, సంగె కిరణ్, ఐరోండ్ల మధు, గణేష్, హరి, శివ, నర్సింగం విష్ణువర్ధన్, ప్రణయ్ కుమార్, రోహిత్, నాలి శివ, చిలుకూరి నందన్, కోడి సాయి,ఉపేందర్, ఎలుగు కార్తీక్ యాదవ్, ఐరోండ్ల మధు, గణేష్, హరి, శివ, నర్సింగం విష్ణువర్ధన్, ప్రణయ్ కుమార్, రోహిత్, నాలి శివ, చిలుకూరి నందన్ తదితరులు పాల్గొన్నారు.

